కథ

# వెన్ యు రియలైజ్ దట్..

అరుణ్ కుమార్ ఆలూరి
63058 16242



అయాన్

ఫోన్ శబ్దం చేయకుండా స్క్రీన్ మాత్రమే వెలిగింది. ఇంట్లో వాళ్ల నాన్న ఉండటంతో తనుకూడా సైలెంట్ మోడ్‌లో మెలగాల్సి వస్తున్నది. సమీర నుంచి వాట్సప్‌లో మెసేజ్ వచ్చింది. కొత్తగూడెంకు చెందిన ఎవరో ఇద్దరు ప్రేమికులు రిజిస్టర్ మ్యారేజ్ చేసుకోవడానికి పెట్టుకున్న దరఖాస్తును పంపింది. అమ్మాయి మెజారిటీ, అబ్బాయి మైనారిటీ అని అందులో ఉన్న ఫొటోలు, పేర్లని బట్టి తెలుస్తున్నది.

'మరో లవ్‌జిహాద్. అమ్మాయి తల్లిదండ్రులకు ఈ విషయం చేరేంత వరకు షేర్ చెయ్యండి..' అని, వాటితో పాటు 'ఫార్వర్డెడ్ మెనీ టైమ్స్' అన్న లేబుల్‌తో వచ్చిందా సందేశం.

'వీళ్లు ఇట్లెందుకున్నరబ్బ? ఎవరిష్టం వాళ్లదని ఇడ్సిపెట్టచ్చు గదా? ఆళ్లుగుడ బైట ఎట్లున్నదో తెల్సి ఈ నెత్తినొప్పులు ఎందుకు పెట్టుకుంటరో?' అని వాటి కింద ఆమె పంపిన మెసేజ్ కూడా ఉంది.

తను అనవసర విషయాలకు టెన్షన్ పడుతుంటుందని అతని భావన. ఏం సమాధానం ఇవ్వాలో తెలియక..

'పోనీలే.. వదిలెయ్! అవును అసలారోజు పది నిముషాల్లో వస్తానని గంట వరకు రాలేదు. ఎన్నిసార్లు ఫోన్ చేసినా.. వస్తున్నా అంటావు కానీ రావు. అప్పుడే ఊహించాల్సింది.. ఫ్యూచర్‌లో కలవటానికి కూడా ఇలాగే డిలే చేస్తావని' అంటూ రిప్లయి ఇచ్చి టాపిక్ మార్చాడు.

'ఫోన్‌ల చాటింగ్ చేస్తున్నం. మాట్లాడుకుంటున్నం సాలదా? కలవనీకి అంటె ఇంట్ల కారణం చెప్పాల. ఆరు గంటలు బస్‌ల కూసుండాల. అంతవుస్రం ఏమున్నదిప్పుడు? ఇంతకుముందు ఏమన్నవు.. గంట వరకు రాలేదా? హ హ.. అయినా నువ్వింకా ఫస్టు రోజును మర్చిపోలే?'.. లోగొంతుకతో రికార్డ్ చేసి పంపినట్టుంది. హెడ్‌సెట్‌లో హస్కీ వాయిస్ చెవుల గుండా లోపలికి వెళ్లి.. గుండెను హత్తుకున్నట్టు అనిపించి, అతని చేతిమీద రోమాలు క్షణకాలం నిక్కబొడుచుకున్నాయి. ఆ అమ్మాయికి టైప్ చేయటమంటే బద్ధకం! అందుకే వాయిస్ మెసేజ్. ఇంట్లో పరిస్థితులను బట్టి స్వరంలో హెచ్చుతగ్గులుంటాయి.

బ్యాంక్, గ్రూప్ ఉద్యోగ పరీక్షల కోసం అతను ప్రిపేర్ అవుతున్న సమయంలోనే.. ఉపాధ్యాయ పరీక్షల కోసం ఆమె సిద్ధమవసాగింది. ఇద్దరికీ కామన్‌గా ఉండే జీకే, ఇంగ్లిష్ మొదలైన సబ్జెక్టులు చెప్పే కోచింగ్ సెంటర్ దగ్గరికి.. నోటిఫికేషన్ వెలువడిన మరునాడే వెళ్లినప్పటికీ, అడ్మిషన్ కోసం బయటున్న కుర్చీల్లో చాలాసేపు ఎదురుచూసేంత మంది వచ్చారు. లగేజ్‌తో సహా వచ్చి అతని పక్కనే కూర్చుంది. కాసేపటికి తన స్నేహితురాలు.. 'హాస్టల్ దొరికింది' అని ఫోన్ చేయడంతో, సామాన్లు చూడమని చెప్పి అతని నంబర్ తీసుకొని, గబగబా వెళ్లిపోయింది.

జరిగింది గుర్తొచ్చి..

'హ హ.. ఏం చెయ్యాల మరి! ఆ హాస్టల్ చెండాళంగా ఉంది. అక్కడున్న అన్ని హాస్టల్లూ సూశి, లాష్టుకి ఒక్కటి కొంచెం సోపు అన్పించి అడ్వాన్స్ ఇచ్చొచ్చే సరికి.. ఆ టైం అయ్యింది' అని మెసేజ్ పంపింది.

'అసలారోజు లగేజ్ తీసుకొని పారిపోయుంటే తెలిసేది' అని పంపాడు.

కుదిరినప్పుడల్లా వాళ్లు మొదటి నుంచి అన్నీ నెమరువేసుకొని గుర్తుచేసుకుంటూ, తద్వారా ఎన్నో యుగాలుగా ఒకరికొకరు తెలిసిన వాళ్లమన్న లోకంలోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తుంటారు.

'నోట్లె యేలు వెడ్తె కొర్కడన్నట్టుండె నీ మొకం. అందుకే నా సామాన్ నీకప్పజెప్పిన హ హ..' అంటూ తెరలు తెరలుగా నవ్వుతున్నదామె.

దూరం నుంచి వాళ్లమ్మ గొంతు..

''ఏందే.. ఎంతసేపు నగుడు? పంటె కాదా?'' అని.

ఇంతలో వాళ్ల నాన్న..

''ఏదో సినిమా సూస్తున్నట్టు ఉన్నది. పంటది తియ్!'' అంటూ.

నవ్వు ఆపుకొంటూనే..

''ఆ.. పంటున్ననే!'' అన్నది.

'సరె బై.. మరి!' అంటూ చాటింగ్ ముగించింది.

* * *

ఆ కోచింగ్ సెంటర్‌లో ఉదయం తొమ్మిది వరకు క్లాస్ అయిపోగానే, సైన్స్ సబ్జెక్ట్‌లో తర్ఫీదు కోసం దగ్గర్లోని మరో సెంటర్‌కి వెళ్లేది. ఆ అబ్బాయి నిదానంగా పది గంటల బ్యాచ్‌లో వచ్చేవాడు. దాంతో ఇద్దరికీ కలుసుకునే అవకాశం ఉండేది కాదు. అయితే నోటిఫికేషన్లకు సంబంధించి ఏదైనా కొత్త విషయం తెలిసినా, కొత్త స్టడీ మెటీరియల్ ఏమైనా దొరికినా ఫార్వర్డ్ చేసుకునేవారు.

ఒకరి గురించి ఇంకొకరు తెలుసుకోవడానికి వారి ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం అకౌంట్లు ఉపయోగపడ్డాయి. ఇద్దరూ ఖాళీగా ఉన్న రోజు, ఒకవైపు పనులు చేసుకుంటూనే మరోవైపు రోజంతా వాయిస్ మెసేజ్‌ల రూపంలో మాట్లాడుకుంటూ.. పక్కపక్కనే గడుపుతున్న అలౌకిక భావనలో ఉండేవారు.

* * *